


# ఆప్యాయతకు ఆనకట్ట

పాలగిరి వేణు

"ఎప్పుడొచ్చావోయ్ నరహరీ! ఎక్కణ్ణించి మాట్లాడుతూంట... ఏంటి వచ్చి మూడురోజు లయ్యాయా? పిన్ని... శేఖరం అందరం బావున్నాం... 'సెమినార్' ఎప్పుడు పూర్తవుతుంది? అయితే శనివారం కల్లా వచ్చేయాలి..." అంటూ సుందరంబాబాయి 'ఫోను'లో మాట్లాడుతున్నాడు...

"అలాగేనండి... తప్పకుండా శనివారం వుదయంకల్లా వచ్చేస్తాను..." అంటూ ఫోను పెట్టేశాను...

బాబాయింట్లో ఫోను లేదు... ఇల్లుగల వాళ్ళ ఫోనది...

సుందరం బాబాయి "స్టేట్ సెక్రటరియేట్"లో 'అసిస్టెంట్ సెక్రటరీ'గా పని చేసి మూడు సంవత్సరాల క్రితమే రిటైరయ్యారు... వాళ్ళబ్బాయి శేఖరం ఏదో ప్రైవేటు మందుల కంపెనీలో 'అక్కౌంటెంట్'గా పనిచేస్తున్నాడు... వీరికి బంధుప్రీతి ఎక్కువ... ఎంతో ఆప్యాయత, అభిమానం గలవారు... మా వాళ్ళల్లో, ఎవరు హైదరాబాద్‌కెళ్ళినా బాబాయింట్లో ఓ వారం రోజులు తిష్ట వేయకుండా వుండరు.

సుందరం బాబాయి వాళ్ళను చూసి ఆరేళ్ళుదాటింది. సుమతక్క పెళ్ళిలో కల్సాం. అప్పటికే నేను 'ఎం. కాం.' పూర్తి చేసి వుద్యోగ ప్రయత్నాల్లో వుండడం జరిగింది. హైదరాబాద్‌కొచ్చి తనదగ్గరుండి ఉద్యోగ విషయాలు చూసుకొమ్మని సలహా యిచ్చారు బాబాయి. అలాగేనని హైదరాబాద్‌కు ప్రయాణమయ్యే లోపుగా, మద్రాసు నుండి ఒక ప్రముఖ కంపెనీ నుండి యింటర్వ్యూ రావడం, అందులో నేను సెలక్టు కావడం, వెంటనే ఉద్యోగంలో చేరిపోవడం జరిగింది. ఈ సంగతి బాబాయికి ఉత్తరం రాశాను. ఎంతో అభినందిస్తూ బదులు రాశారు ఆయన. నేను మద్రాసుకెళ్ళిన మొదట్లో శేఖరన్నయ్యకు, నాకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. శేఖరన్నయ్యకు పెళ్ళి జరిగి, సంసార బాధ్యతలు నెత్తిమీద పడేసరికి, రాను రాను అవి తగ్గిపోయాయి. ఇప్పుడా మాటే లేదు. వాడి పెళ్ళికి వెళ్ళలేక పోయాను శెలవు దొరక్క.

అప్పుడు శేఖరన్నయ్య తన ప్రతి ఉత్తరంలోను నన్ను హైదరాబాద్ కొచ్చి కొద్దిరోజులైనా సరదాగా గడపమని రాసేవాడు. ఆ అవకాశం వచ్చింది ఇప్పుడు. "సౌత్ఇండియా ఇండస్ట్రియల్ మార్కెటింగ్ మానేజ్‌మెంట్ సెమినార్"కు మా కంపెనీ వాళ్ళు నన్ను 'డెలిగేట్' చేసి హైదరాబాద్‌కు పంపారు. సెమినార్ 'రెసిడెన్షియల్'గా వుంచారు. లేకపోతే బాబాయిగారింట్లో దిగేవాణ్ని. ఉదయం ఎనిమిది నుండి సాయంకాలం ఆరు గంటలవరకు ఏవో 'లెక్చర్స్'తో సరిపోయేది. ఈ సెమినారు మూడు రోజులు ఈరోజుతో అయిపోతుంది. రేపు అంటే శనివారం బాబాయింటికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను. అందుకనే బాబాయికి ఫోను చేశాను. శనివారం... ఉదయం ఏడు గంటలకే మద్రాసు నుంచి వచ్చిన కొందరు కొలీగ్స్ 'సైట్ సీయింగ్' అంటూ వెళ్ళి పోయారు. నేను కూడా బాబాయింటికి బయల్దేరాను. బాబాయి యిల్లు 'విజయనగర్ కాలనీ'లో వుంది. ఇల్లు సులభంగానే దొరికింది.

"రావోయ్! నరహరీ!!" అంటూ ఇంటి గేటుముందేనిలబడి పిలుస్తున్నాడు బాబాయి. ఎంతో ఆప్యాయతగా భుజమ్మీద చేయేసి లోపలికి తీసుకెళ్ళాడు. ముందు గదిలో కూచోబెట్టాడు గది శుభ్రంగా వుంది ప్రక్క గదిలోంచి పిల్లలు ఏదో హిందీ పాఠాన్ని గట్టిగా చదివేస్తున్నారు.

'ఒసేవ్! నరహరి వచ్చాడు" అంటూ పెద్ద కేకెట్టి పిన్నిని పిలిచాడు.

సుందరం బాబాయి బాగా తగ్గాడు. 'వార్ధక్యం' బాగా కొట్టొచ్చినట్టు కనపడు

తోంది. మాట మాటకు చిరుదగ్గు దగ్గుతున్నాడు. కాని అప్పటి చలాకీతనం మాత్రం తగ్గలేదు.

"శేఖరన్నయ్య వున్నాడా బాబాయ్?"

"లేదు. ఇప్పుడే మార్కెట్టుకు వెళ్లినట్టుంది, ఉదయం వెళ్తే తాజా కూరలు దొరుకుతాయని..."

నేను మౌనంగా వుండిపోయాను.

"అది సరేగాని నరహరీ! మీ నాన్న,అమ్మ ఎలా వున్నారు! ఒక్కసారి భీమవరం వెళ్లి చూసొద్దామంటే ఒంట్లో ఓపిక లేదురా! సుమతి కెంతమంది పిల్లలు. మీ తమ్ముడు నరసింహ్మం ఎమ్. ఎస్‌సి. పూర్తి చేశాడని విన్నాను. ఎక్కడైనా ఉద్యోగం...?" గుక్క తిప్పకోకుండా అడిగేస్తున్నాడు బాబాయి. దగ్గు కూడా బాగా వస్తోంది.

జవాబులు నెమ్మదిగా చెప్తున్నాను. తలుపుదగ్గర ఏదో శబ్దమయ్యింది. గాజుల చప్పుడు. పిన్ని అనుకొని తలెత్తి చూశాను. పిన్నికాదు. ఆవిడ భుజంమ్మీదుగా పొడువాటి 'హ్యాండ్ బాగ్' వేలాడుతోంది, బైటకెళ్లాలనుకున్నట్టుంది. ఆమె నన్ను అదో రకంగా చూసి లోనికి వెనుదిరిగి పోయింది ... రెండు నిముషాల్లో తిరిగొచ్చి "వెళ్లొస్తా! మామయ్యా!! బస్సు దొరుకుతుందో లేదో" అంటూ అక్కణ్ణించి వేగంగా వెళ్లిపోయింది. వెళ్తూ బాబాయిని అదోలా చూసింది.

"మీ వదినరా! సంజీవరెడ్డి నగర్ కాలనీలో ఓ ప్రవేటు స్కూల్లో టీచరుగా పని చేస్తోంది. ఇంతవరకు నీవు చూళ్లేదు కామోసు ... పరిచయం చేద్దామనుకున్నాను కాని..." అంటూ బాబాయి నాకేదో సంజాయిషీ చెప్తున్నట్టు భావించాను ... ఆమెను చూస్తూనే బాబాయి ముఖంలో ఏదో మార్పు కల్గింది ... ఆ 'మార్పు' ను సరిగా అర్థం చేసుకోలేకపోయాను ... వదిన వెళ్తూ బాబాయి వైపు చూసిన చూపులకు, బాబాయి ముఖంలో కల్గిన కదలికలకు లంకె వుంది ..

పిన్ని లోపలి నుంచి యింకా రాలేదు ... నాకేమో ఆమెను చూడాలని మనసు లాగుతోంది ... చనువుగా యింట్లోకి వెళ్లాలంటే బావుండదు మరి...

"బాబాయి! పిన్ని..."

"వస్తుంది ... నరహరీ! ఏదో పని మీద వున్నట్టుంది...పిలుస్తానుండు" అంటూ లోనికి వినపడేట్టుగా మరింత గట్టిగా "ఒసేవ్" అంటూ పిల్చాడు బాబాయి ...

లో నుంచి జవాబు రాలేదు.. పిన్ని కూడా రాలేదు.

"తాతయ్యగారూ! నాయనమ్మ పూజలో వుంది...ఇప్పుడే వస్తానంటోంది..."అంటూ ఓ ఐదేళ్లమ్మాయి మా ముందు కొచ్చింది.

"శేఖరం పెద్దమ్మాయి కాన్వెంట్ లో ఒకటోక్లాసు...

"నీ పేరేమిటమ్మా!" అంటూ ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకొన్నాను...

"అపర్ణ" అంటూ ముద్దుగా చెప్పింది. పిల్లలకోసం తెచ్చిన స్వీటు ప్యాకెట్ను

"పరిమాణం"

జీవనదిలా
సాగిపోయే
కాలవాహినిలో
జీవితం ...
దోపిడు వీళ్ళ—
నిజమని నువ్వు
భ్రమించే
అనుబంధం
అందులో ఒకే ఒక
నీటి బిందువు —

– వీరపల్లె వీణావాణి

అమ్మాయి చేతిలో వుంచాను ఆ అమ్మాయి వాళ్ళ తాతయ్యగారు తీసుకోమన్నాక గాని తీసుకోలేదు.

"ఉండేవి మూడు గదులు, అద్దె రెండు వందల ఏభై, కరెంటు నీళ ఛార్జీలు మనమే కట్టుకోవాలి" అంటూ బాబాయి మొదలెట్టాడు...ఏదో ఒకటి మాట్లాడాలి అనే ధోరణిలో ...

మరో మూడు నిముషాలు గడిచాయి ... బాబాయి కుర్చీలోంచి లేచి వున్నట్టుండి లోనికెళ్లాడు ... వెంటనే తిరిగొచ్చాడు ... "శేఖరం వుంటే బావుండేది ?" అంటూ తనలో తాను బిగ్గరగా గొణుక్కుంటూ కుర్చీలో కూచున్నాడు. ముఖమంతా చెమటతో నిండి వుంది ...

"ఏమయింది బాబాయి ?" అంటూ ఆతృతగా అడిగాను.

"ఏంలేదం"టూ బాబాయి మొహమాట పడుతున్నాడు..."చెప్పు బాబాయి" అంటూ మరోసారి అడిగాను ... "ఏం లేదురా ? నీ దగ్గర ఓ ఇరవై వుందా ? శేఖరం వస్తూనే యిస్తాను"అంటూ భుజమ్మీదున్నతువ్వాల్తో చెమట్లుతుడుచుకుంటూ .పర్సులోంచి రెండు పదులు తీసిచ్చాను...లోని గుమ్మం వైపు... గేటువైపు చూసి మెల్లగా జేబులో వుంచుకున్నాడు ఆ యిరవైని బాబాయి ... "ఎందుకని?" నేను అడగలేదు...'అందుకని' బాబాయి చెప్పలేదు ... లోని కెళ్లిపోయాడు బాబాయి...

లోన ఏదో ఘర్షణ జరుగుతున్నట్టు తెలుస్తోంది ...

బాబాయి వెంట పిన్ని వచ్చింది...

"బావున్నావురా! నరహరీ!" అంది పిన్ని ఎంతో ఆప్యాయతతో ... పిన్ని అప్పుడే జబ్బులోంచి లేచినట్టుంది ... తలంతా ముగ్గుబుట్టలా వుంది. కళ్లల్లో నీళ్లు కదులుతున్నాయి.

"నీ వెలా వున్నావ్ ? పిన్నీ"

"బాగున్నారా! మీ అమ్మ ఎలా వుంది ? ఏరా పప్పు భోజనం ఎప్పుడు పెట్టిస్తావ్ ? ముత్యాలంపాడు సంబంధ మేమైనా కుదిరేట్టుగా వుందా ?" అంటూ నా పెళ్లి గురించి వాకబు మొదలెట్టింది ...

"ఒట్టి మాటలేనా! కాఫీ ... టిఫిన్ ఏమైనా యిచ్చేది వుందా లేదా ?" అంటూ బాబాయి హుందాగా పిన్ని వైపు చూశాడు. పిన్ని ఆ చూపుల్ని తట్టుకోలేక మరో వైపు ముఖం తిప్పకుంది ...

"పాలబ్బాయి యింకా రాలేదు ... రాత్రి పాలుంటే తోడు పెట్టాను..."

పిన్ని ముఖంలో బాధ ... అణుచుకోలేక గట్టిగా ఏడ్చేసింది. పరుగు లాంటి నడకతో లోనికి వెళ్ళిపోయింది. బాబాయి ఏం మాట్లాడలేదు... ఆవేదనతో కిటికీ వూచల్ని పట్టుకొని బైటకు చూస్తున్నాడు...

పరిస్థితి నా కర్థం కాలేదు. ఇంట్లో ఏవో గొడవలు జరిగి వుండాలి ... కాని బైటపడి పోతున్నారు...

ఈ వాతావరణంలోంచి బైట పడాలని పించింది. నా రాక వల్ల ఏవైనా మనస్పర్థలు

ఓం శ్రీ మాత్రే నమః



నవశక్తి నిలయం నుంచి
భక్తులకు వినూత్న అవకాశము

శ్రీ మురుగన్స్ మరియు జగద్గురువులు ఆశీర్వాదముతో
దైవదత్తమైన వస్తువు రూపొందించు సంస్థ

శ్రీ కంచి కామకోటి శ్రీ జయేంద్ర సరస్వతి,
శ్రీ శృంగేరి శారదాపీఠ మహా సన్నిధానము,
గోండల్ శ్రీ ఆచార్య శ్రీ శరణతీర్థ మహరాజ్
మరియు ఇతర ఋషి తుల్యులు.

| | | |
|---|---|---|
| 1. | శ్రీ మహామేరు (పంచ లోహాలు) 2¼" × 2¼" | రూ. 500—00 |
| 2. | శ్రీ మహామేరు (పంచ లోహాలు) 1½" × 1½" | రూ. 300—00 |
| 3. | ద్రిష్టి నివర్తి యంత్రము. | రూ. 45—00 |
| 4. | ద్రిష్టి నివర్తి డాలర్ (ఈ యంత్రము కలిగియున్న వారికి దుష్ట శక్తుల ప్రభావాన్ని తొలగించి, దృష్టి దోషమును హరించి ప్రమాదములు మొదలైనవి జరగకుండును. ఎటు వంటి ఒడుదుడుకులు, కష్టములు సంభవించకుండా కాపాడును. గృహములోగాని, వ్యాపారములోగాని కూడ ఉంచుకొనవచ్చును). | రూ. 37—00 |
| 5. | వివాహప్రాప్తి డాలర్ (వివాహములు త్వరగా జరుగుటకు) | రూ. 45—00 |
| 6. | ధనప్రాప్తి డాలర్. | రూ. 45—00 |
| 7. | కామాక్షి డాలర్. | రూ. 45—00 |
| 8. | శ్రీ చక్రం యంత్రం 3" × 3" | రూ. 115—00 |
| 9. | శ్రీ చక్రండాలర్. | రూ. 45—00 |
| 10. | స్ఫటికమాల 54 పూసలు | రూ. 60—00 |
| 11. | ఒరిజనల్ తామరమాల 54 పూసలు | రూ. 100—00 |
| 12. | నవగ్రహ డాలర్లు (9 రకములు) ఒక్కొక్కటి. | రూ. 37—00 |
| 13. | రుద్రాక్షమాల 54 పూసలు | రూ. 250—00 |
| 14. | ఎలక్ట్రానిక్ బ్రాస్‌లెట్ 12 రాసులు ఒక్కొక్కటి | రూ. 20—00 |
| 15. | అష్టలక్ష్మి మరియు ఇతర దేవతా డాలర్ [ఎంబోసిడ్‌నమూనా] | రూ. 105—00 |

ఆర్డరుతో సరుకు విలువపై 25 శాతమును ముందుగా పంపవలెను.

వస్తువులు వి.పి.పి. పోస్టు ద్వారా పంపబడును.

సంప్రదించండి.

విశ్వకర్మజ్ఞ శ్రీ విద్యా వుపాసక స్వామిజి,

శ్రీ ఎస్. టి. మురుగభూషణం.

(ప్రెసిడెంట్ మరియు సలహాదారుడు)

నవశక్తి నిలయం,

153, లాయడ్స్‌రోడ్, గోపాలపురం, మద్రాసు-600086.

ఫోన్ : 812013. ఉత్తర ప్రత్యుత్తరములు తమిళము మరియు ఇంగ్లీషులో.


## ఆప్యాయతకు ఆనకట్ట

కలిగాయా ? ఎందుకో వుండాలని పించడం లేదు.

"ఇక వెళ్తాస్తా ! బాబాయ్ !! తొమ్మిది కల్లా "గ్రూప్ డిస్కషను" వున్నాయి ... మధ్యాహ్నం గోల్కొండలో గుంటూరు వెళ్ళి సుమతక్క దగ్గర రెండురోజులు ఉండి మద్రాసు వెళ్తాను...పిన్నికి చెప్పండి ... శేఖరన్నయ్యకు ...వదినకు కూడాను" అంటూ కుర్చీలోంచి లేచాను.

"అదేంట్రా ! భోజనానికైనా వుండకుండా !"

"లేదు బాబాయి నేను వెళ్ళాలి ... మళ్ళీ రేపు నెలలో వస్తాను... అప్పుడు తప్పకుండా యిక్కడే దిగుతాను..."

ముందుకు నడిచాను...బాబాయి నా వెంట గేటు దాకా నడిచాడు.

"చూడరా నరహరీ ! యీ డబ్బుతో సుమతి పిల్లలకేమైనా తీసుకెళ్ళు" అంటూ బాబాయి నా చేతిలో నోట్లు వుంచాడు ... వద్దన్నాను, ఎంతో చెప్పిచూశాను...వినలేదు. సరేనంటూ ఆ డబ్బును ప్యాంటు జేబులోకి కుక్కాను..."వస్తా ! బాబాయి..." అంటూ శెలవు తీసుకుని రోడ్డున పడ్డాను ... తిరిగి చూశాను ... బాబాయి పిన్ని గేటు దగ్గర నిలబడి వున్నారు. చెంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటోంది పిన్ని ...

నా మనసంతా అస్తవ్యస్తంగా తయారయింది. బాబాయి, పిన్ని ఎందుకిలా వున్నారు ? వాళ్ళ ప్రవర్తనలో ఏదో చెప్పరాని మార్పులు వున్నాయి ... వాళ్ళు చూపిస్తున్న ఆప్యాయత, ఆదరణ వెనుక ఏదో అగాధముంది ...

అలా నడుస్తుకుంటూ వెళ్తున్నాను ... 'ఆటో' దొరికితే బావుండేది ...

"నరహరీ !" అంటూ వెనగ్గా వినిపించి నట్లయ్యింది...తిరిగి చూశాను. ఎదురుగా శేఖరన్నయ్య...సైకిల్ని నడిపిస్తూ నా వైపు వస్తున్నాడు... సైకిల్‌కు సంచి వేలాడతీసి వుంది...కూరలు కనపడుతున్నాయి...

"మద్రాసు నుండి ఎప్పుడొచ్చావురా ... వస్తున్నట్లు వుత్తరం కూడ రాయలేదు. ఇల్లు కనుక్కోవడం కష్టం అయిందా ?" అంటూ నా భుజమ్మీద చేయేశాడు.

జవాబు చెప్పాను.

## కెఫిన్ లేని కాఫీ!

కాఫీలో కెఫిన్ అనే విష పదార్థముంటుంది. ఈ పదార్థము వలన అపకారమే తప్ప ఉపయోగం లేదు. జపానులో యీ కెఫిన్ లేని "ఆరోగ్యకరమైన కాఫీ" ని తయారు చేశారు. జపాను లోని షోకై కాఫీ కంపెనీవారు దీనిని అమ్మకానికి విడుదలచేస్తున్నారు. వీరు పశ్చిమ జర్మనీ సంస్థ అయిన టోటిక్‌కేఫ్ జపాన్ లిమిటెడ్ వారితో యీ మేరకు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

"ఇంటికి పద మరి..."

"లేదన్నయ్యా! ఇంటి నుండే వస్తున్నాను...బాబాయిని, పిన్నిని, పిల్లల్ని చూసి వస్తున్నాను..."

"అదేంట్రా! అంత అర్జంటుగా తిరిగెళ్తున్నావ్? ఓ రెండు రోజులైనా యిక్కడ వుండి..."

"లేదన్నయ్యా! రేపునెల్లో మళ్లీ వస్తాను...అప్పుడు తప్పకుండా?"

శేఖరన్నయ్య నా ముఖంలోకి నిశితంగా చూశాడు...నా భావాల్ని చదివినట్లున్నాడు...

"ఒరేయ్! నరహరి! ఇంట్లో కాఫీయైనా తాగావా లేదా!"

"తాగానన్నయ్యా!"

"నిజం చెప్పు... పాలబ్బాయి రాలేదు ... రాత్రి పాలు తోడుపెట్టానని అమ్మ అనలేదూ..."

ఏం చెప్పాలో తెలియక సందిగ్ధావస్థలో పడిపోయాను ...

ఎదురుగ్గా వున్న చిన్న కాఫీ హోటలకు తీసుకెళ్లాడు శేఖరన్నయ్య... ఓ మూలనున్న టేబిల్ దగ్గర కూచున్నాం-యిద్దరమూనూ. 'పెసరట్లు' చెప్పాడు ...

"నరహరి! నీవు చిన్నవాడివైనా నన్ను క్షమిస్తానంటే చెప్తాను ... అమ్మ, నాన్న ప్రవర్తనకు నీ వెంతో బాధపడుతున్నట్లుంది ...అసలు కారణం చెప్తా! వినరా! ప్రస్తుత పరిస్థితుల్లో...అందులో యిలాంటిపట్నాల్లో బ్రతుకులు ఆర్థికంగా ఎంతో కష్టంగా, భారంగా వెళ్లబుచ్చుతున్నామో నీకు తెలుసు కదా! అన్ని తగ్గింపులు పోనూ, నా కొచ్చేది ఐదొందలు, మీ వదినకు మూడొందలు. పై ఆదాయం లేకపోయె. పిల్లల చదువులకు, అమ్మ మందులకు, నాన్నగారి పై ఖర్చులకు ఎక్కణ్ణుంచి తేను? ఇంటి అద్దె ఎలా భరించను? ... నిజం చెప్పమంటావా నరహరీ! ఏదోరకంగా ప్రతి ఒకడూ ఏదో చుట్టరికాన్ని కలుపుకొని, ఏదో పనిమీద వచ్చి మనింట్లో తిష్ఠ వేయడం... అన్నిరకాలా మనల్ని దోచుకోవడం జరుగుతోంది...అమ్మ, నాన్నలకు బంధు ప్రీతి ఎక్కువ. వచ్చినోళ్లకు వండిపెట్టడంతో అమ్మ జీవితమంతా గడిచిపోయింది. సరైన విశ్రాంతి లేక, అమ్మ ఆరోగ్యం దెబ్బ తినింది... "ఆస్మా" కాల్చుకు తింటోంది అమ్మను. బంధువులు వచ్చినప్పుడు "అవి వండు... ఇవి వండు..." అంటూ అమ్మను పురమాయించడం నాన్నగారి పని. ప్రతినెలా అప్పు చేయడం నా వంతు ... మానసికంగా మీ వదిన, నేను ఎంతో నలిగిపోయాము. బాగా ఆలోచించి ఒక ప్రణాళికను తయారు చేశాం...బంధువనేవాడు రెండోసారి మనింటి వైపు రాకుండా, వచ్చిన వాడికి కనీసం మంచినీళ్లైనా యివ్వకుండా, ఏలాటి పరామర్శలు కూడా చేయకుండా అమ్మా, నాన్నను కట్టుదిట్టం చేశాము. అమ్మా, నాన్నల నోరు కట్టేశాం. నాన్నగారి పెన్షను కూడ నేనే తీసుకుని వాడుకుంటున్నాం అని అనుకోకు ... సర్వీసులో వుండగా నాన్నగారు చేసిన అప్పులకు జమకట్టున్నాం ... ఇందులో మా తప్పుందంటావా? దీని కంతటికి మా ఆర్థిక పరిస్థితే! నీ వెంత బాధపడుతున్నావో నాకు తెలుసు. కాని అంతకన్న అమ్మ నాన్నను...!"

"చాల మంచి పని చేశావన్నయ్యా! ఆప్యాయతకు, ప్రీతికి కూడ హద్దుంది."

పెసరట్లు తిన్నాం, కాఫీ తాగాం. ఇక వెళ్తానంటూ శేఖరన్నయ్య దగ్గర శెలవు తీసుకున్నాను.

"ఈ సారైనా తప్పకుండా వస్తావు కదూ!"

"తప్పక..."

నా మనస్సెందుకో తేలిగ్గా వుంది. బాబాయి, పిన్ని మీద ఎందుకో జాలి వేసింది. 'ఆటో' దొరికింది వెళ్లాల్సిన చోటు చెప్పి అందులో కూలబడ్డాను.

మదాసు కెళ్లగానే నాన్నగారికి వుత్తరం రాయాలి. ఎస్. ఎస్‌సి పాసయి ఖాళీగా వున్న తమ్ముడు నరసింహాన్ని ఉద్యోగ ప్రయత్నం మీద హైదరాబాదుకు సుందరం బాబాయి దగ్గరకు పంపుతానని ఆ మధ్య నాన్నగారు నాకు వుత్తరం రాశారు. హైదరాబాద్‌కు వద్దని, నా దగ్గరకు పంపమని రాయాలి. సుందరం బాబాయి యింట్లో పరిస్థితులేమిటో నేను చూశాక ...

నా రాక గురించి బాబాయి శేఖరన్నయ్యతో ముందుగా చెప్పలేదన్నమాట? మొదటిసారిగా వదిన నన్ను చూసి లోనకెళ్లి, పిన్నితో ఏమని చెప్పి వుండవచ్చు? బాబాయి నా దగ్గర ఓ ఇరవై పుచ్చుకున్నాడు ఈ సంగతి శేఖరన్నయ్యకి, పిన్నికి గాని చెప్తాడా? ఈ ప్రశ్నలకు జవాబులన్ని నాకు తెలుసు.

ఆటో ఆగింది. ప్యాంటు జేబులోంచి పర్సు తీయబోయాను, పర్సుతోబాటు కొన్ని నోట్లు కిందపడాయి. రెండు పదులతో బాటు, ఇంకో పది నోటు కూడ వుంది .. అదెక్కడిది?... ఎర్రసిరా మార్కులున్నాయి దాని మీద ... అంటే అది బాబాయి యిచ్చాడన్న మాట. ఎంతో ప్రేమగా యిచ్చినది నా రెండు పదులతో బాటు... అవును...ఆప్యాయతకు ఆనకట్ట కట్టితే...

